సాక్షి వికారాబాద్

మంగళవారం । 6 । ఆగస్టు । 2024



ఇళ్ల స్థలాలు చూపించాలి

ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి ఏళ్లు గడుస్తున్నా.. భూమి కబ్జా ఇవ్వడం లేదని ఎల్లకొండ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. 8లో▸



అభివృద్ధి పరుగులు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించారు. అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారు. 8లో▸



తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యం

పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు ఎంతో ఆరోగ్యమని హస్నాబాద్ క్లస్టర్ సూపర్‌వైజర్ ప్రభ అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

శ్రీవారి ఆలయాన్ని సందర్శించిన టీటీడీ బృందం



ఆలయ నమూనాను పరిశీలిస్తున్న టీటీడీ అధికారులు

కొడంగల్: పట్టణంలోని బాలాజీ నగర్‌లో వెలిసిన పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని తిరుమల తిరుపతి దేవస్థానం ఇంజనీరింగ్ విభాగం అధికారులు సోమవారం సందర్శించారు. ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల కోసం పరిశీలించారు. తిరుమల తరహాలో ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు వారు తెలిపారు. ఈ నేపథ్యంలో టీటీడీ ఇంజనీరింగ్ విభాగం డీఈ నాగరాజు, ఏఈ తుల సీరాం, ఏఈఈలు జయలక్ష్మీ, రవిశంకర్, స్తపతి రవికాంత్ తదితరులు ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆలయ విస్తరణలో భాగంగా చేపట్టాల్సిన పనుల గురించి ఆలయ ధర్మకర్తలను అడిగి తెలుసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు శ్రీనివాస్, రత్నం, మధు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 141 దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్

అనంతగిరి: ప్రజావాణి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి సత్వరం పరిష్కరించాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి 141 దరఖాస్తులు వచ్చాయి. వాటిని ఆయా శాఖలకు కేటాయించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

అనంతగిరి: భారత్ ఫైనాన్షియల్ ఇంక్లూషన్ లిమిటెడ్‌లో ఖాళీల భర్తీకి బుధవారం వికారాబాద్‌లోని ఐటీఐ కళాశాల ఆవరణలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సుభాన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు 100 ఉద్యోగాల భర్తీ కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. యువకులు మాత్రమే అర్హులన్నారు. ఇంటర్, అంతకంటే ఎక్కువ చదివిన వారు హాజరుకావాలని కోరారు. వయసు 18 –28 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 9676047444లో సంప్రదించాలన్నారు.

ఎంజీఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కాలేజీలో ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కట్టెకోల కాశీనాథ్‌కు తమిళనాడులోని వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. 'ఆన్‌లైన్ విద్య– తెలంగాణలోని ఎంపిక చేసిన జిల్లాలోని ఆంగ్ల మాధ్యమిక స్థాయి ఉపాధ్యాయుల అభ్యాసాలు మరియు సవాళ్లు' అంశంపై ఇంగ్లిష్‌లో పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకుగానూ డాక్టరేట్ ప్రకటించింది.

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి

- రూ.112 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- వికారాబాద్, తాండూరు ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తామని వెల్లడి



తాండూరులో ఎడ్ల బండిపై ర్యాలీగా వస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి, ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, కాలె యాదయ్య

తాండూరు టౌన్: అన్ని ప్రాంతాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం తాండూరు నియోజకవర్గం పరిధిలో రూ.112 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా కేంద్రం వికారాబాద్, తాండూరు ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తామని ప్రకటించారు.తాండూరు పట్టణ శివారులో బీఆర్‌ఎస్ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిస్థితి పైన పటారం లోన లొటారంలా ఉందని ఎద్దేవా చేశారు. కావాల్సిన నిధులు మంజూరు చేసి రెండు నెలల్లో ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేస్తామని తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

రూ.4.88 కోట్లతో మహబూబ్‌నగర్ – చించోళి నాలుగు లేన్ల రోడ్డు పనులకు, అలాగే బ్రిడ్జి నిర్మాణానికి స్పీకర్, మంత్రులు శంకుస్థాపన చేశారు. అలాగే రూ.1.06 కోట్లతో తాండూరులోని ముర్షద్ దర్గా నుంచి కింగ్స్ ప్యాలెస్ వరకు సీసీ రోడ్డు పనులకు, రూ.4.88 కోట్లతో గొల్ల చెరువు సుందరీకరణ పనులకు, రూ.27.5 కోట్లతో అమృత్ 2.0 నీటి సరఫరా పనులకు శంకుస్థాపనలు చేశారు. జినుగుర్తిలో రూ.2.48 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ప్రారంభించారు. చంద్రవంచ,కందనెల్లి, జుంటుపల్లిలో కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.30 కోట్లతో బషీరాబాద్ – కరన్‌కోట్ రోడ్డు పనులకు, రూ.3 కోట్లతో ఆర్‌అండ్‌బీ అతిథి గృహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

పాలకవర్గ ప్రమాణ స్వీకారం

స్పీకర్, మంత్రుల సమక్షంలో తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పట్లోళ్ల బాల్‌రెడ్డి, పాలక మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అంతకుముందు స్థానిక ఇందిరాచౌక్ నుంచి పాలకమండలి సభ్యులు ఎడ్ల బండ్లపై ర్యాలీగా స్థానిక ఎస్వీఆర్ గార్డెన్ చేరుకున్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ నాయకులు, అభిమానులు సోమవారం ఘనంగా నిర్వహించారు.స్పీకర్, మంత్రుల సమక్షంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పలువురు రక్తదానం చేశారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు రమేష్ మహరాజ్, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, నాయకులు ధారాసింగ్, కరణం పురుషోత్తంరావు, కలెక్టర్ ప్రతీక్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

పెద్దేముల్: వికారాబాద్ – తాండూరు రోడ్డు విస్తరణ, మరమ్మతు పనుల కోసం రూ.48.80 కోట్లు మంజూరయ్యాయి. సోమవారం స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఇందుకు సంబంధించిన పనులకు శంకుస్థాపన చేశారు. సకాలంలో పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్ జైన్, డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ధారాసింగ్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళ అధ్యక్షురాలు శోభారాణి, కోటపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఆంజయ్య, వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గోపాల్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

వికారాబాద్: నియోజకవర్గంలో రూ.60 కోట్ల నిధులతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సోమవారం స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. రూ.12 కోట్ల వ్యయంతో వికారాబాద్ పట్టణంలోని ఆలంపల్లి నుంచి రాళ్లచిట్టంపల్లి వరకు డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు, రూ.6 కోట్ల వ్యయంతో వికారాబాద్‌లో ఆర్‌అండ్‌బీ అతిథి గృహ నిర్మాణానికి, అలాగే రూ.42 కోట్ల వ్యయంతో మర్పల్లి నుంచి కోట్‌పల్లి వరకు వివిధ అనుసంధాన రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ముందుగా కలెక్టర్ ప్రతీక్ జైన్.. మంత్రి, స్పీకర్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. పోలీసులు గౌరవ వందనం చేశారు. కార్యక్రమంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి హరిచందన, ఇంజనీర్ ఇన్ చీఫ్ మోహన్‌నాయక్, ఎస్‌ఈ వసంతనాయక్, ఇన్‌చార్జ్ ఈఈ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, వైస్ చైర్మన్ శంషాద్ బేగం, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు సత్యనారాయణ, కిషన్‌నాయక్, రాంచంద్రారెడ్డి, కొండల్‌రెడ్డి, నరోత్తంరెడ్డి, రత్నారెడ్డి, రమేష్ కుమార్, హఫీజ్, వహీద్ మియా, అనంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'నీళ్లపల్లి' వివాదాన్ని పరిష్కరిస్తాం: మంత్రి పొంగులేటి

బషీరాబాద్: తెలంగాణ – కర్ణాటక సరిహద్దు అటవీ భూముల వివాదాన్ని పరిష్కరిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం బషీరాబాద్ మండలంలో పర్యటించిన మంత్రి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకారంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. బషీరాబాద్ మండలం నీళ్లపల్లికి సరిహద్దున ఉన్న కర్ణాటక గ్రామాల రైతులు మన రాష్ట్ర అటవీ భూముల్లో పంటల సాగు చేయడంపై ఈ నెలాఖరులోపు పూర్తి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను మంత్రి ఆదేశించారు. ఈ విషయమై త్వరలో కర్ణాటక ప్రభుత్వంతో చర్చించి ఉమ్మడి సర్వే చేసి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం స్పీకర్ ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ.. మరో పదేళ్లు రేంవత్‌రెడ్డే సీఎంగా ఉంటారని పేర్కొన్నారు. తాను పుట్టిన తాండూరుకు, పెరిగిన వికారాబాద్‌ను సమాంతరంగా అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. రోడ్ల అభివృద్ధికి రూ.250 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. తాండూరు నియోజకవర్గాన్ని దత్తత తీసుకొని అభివృద్ధికి నిధులు ఇవ్వాలని మంత్రిని కోరారు. మంత్రి శీనన్న మాట ఇస్తే సీఎం ఇచ్చినట్లేనని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. అంతకు ముందు వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా మాధవరెడ్డి, వైస్ చైర్మన్ చందర్, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం జీవన్గీ కరణ్‌కోట్ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కరుణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న స్పీకర్, మంత్రులు

జిల్లాకు కొత్తగా 11 సబ్ స్టేషన్లు : స్పీకర్ ప్రసాద్‌కుమార్

తాండూరు రూరల్: జిల్లాకు కొత్తగా 11 విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరైనట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. సోమవారం తాండూరు మండలం జినుగుర్తి గ్రామ సమీపంలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో జినుగుర్తి, చంద్రవంచ, జుంటుపల్లి, కందనెల్లి గ్రామాలకు సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయని, వీటిలో జినుగుర్తి సబ్‌స్టేషన్ మాత్రమే పూర్తయ్యిందని తెలిపారు. జిల్లాలోని యసారం, కేసారం, న్యూ కలెక్టరేట్, గోధమగూడ, ఎన్కెపల్లి, లగచర్ల, హుస్నాబాద్, కిష్టపూర్, కుసుమ సముద్రం, నారాయణపూర్, కొత్తగడి గ్రామాలకు కొత్తగా సబ్‌స్టేషన్లు మంజూరైనట్లు వివరించారు. ఒక్కో సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.4 కోట్ల చొప్పున 11 సబ్‌స్టేషన్లకు రూ.44 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్, మాజీ ఎంపీ రంజిత్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్‌ఈ సంజీవ్‌రెడ్డి, డీఈ భానుప్రసాద్, ఏడీ ఆదినారాయణ, ఏఈ వెంకట్ నాయుడు పాల్గొన్నారు.

కొడంగల్‌లో పరిశ్రమలు నెలకొల్పండి

న్యూయార్క్‌లో సీఎంను కలిసిన ఎస్వీఆర్ ఇండస్ట్రీస్ అధినేత ఆశ్రయ్‌చారి



సీఎం రేవంత్‌రెడ్డితో ఆశ్రయ్‌చారి

దుద్యాల్: కొడంగల్ నియోజకవర్గంలో పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉపాధి కల్పించాలని ఎస్వీఆర్ ఇండస్ట్రీస్ అధినేత ఆశ్రయ్‌చారి సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. విదేశీ పర్యటనలో ఉన్న సీఎం, మంత్రి శ్రీధర్‌బాబును న్యూయార్క్ నగరంలో సోమవారం ఆయన మర్యాద పూర్వకంగా కలిసి మాట్లాడారు. కొడంగల్ ప్రాంతంలో నిరుద్యోగ సమస్య అధికంగా ఉందని, పరిశ్రమల ఏర్పాటుతోనే ఇది తీరుతుందని ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా ఆశ్రయ్‌చారి, ఆయన తండ్రి కమలనాభాచారి 'సాక్షి'తో మాట్లాడారు. కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో ఉన్న కొడంగల్ అభివృద్ధిని గత పాలకులు పట్టించుకోలేదన్నారు. కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో ఈప్రాంత అభివృద్ధిపై ఆశలు చిగురించాయని తెలిపారు. తమ ప్రాంతానికి ఏదైనా చేయాలనే సంకల్పంతోనే రోడ్లు, సాగునీరు, ఇంటిగ్రేటెడ్ గురుకుల పాఠశాల, కళాశాల భవనాలకు నిధులు ఇచ్చామని గుర్తుచేశారు. దుద్యాల మండలం హస్నాబాద్‌లో ఎస్వీఆర్ ఇండస్ట్రీస్‌ను నెలకొల్పి నిరుద్యోగులకు తమ వంతు అండగా నిలుస్తున్నామన్నారు. కొడంగల్ ప్రాంతంలో మరిన్ని కంపెనీలు ఏర్పాటు చేస్తే మరింత మంది నిరుద్యోగులకు ఉపాధి దొరుకుతుందనే భావన వ్యక్తం చేశారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

- రంగారెడ్డి కలెక్టర్ శశాంక



స్వచ్ఛదనం-పచ్చదనం పరిరక్షణకు ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం: పల్లెలు, పట్టణాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యవంతమైన జీవనం సాగుతుందని కలెక్టర్ శశాంక అన్నారు. 'స్వచ్ఛదనం–పచ్చదనం' కార్యక్రమాన్ని సోమవారం ఇబ్రహీంపట్నంలో పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి, స్వచ్ఛదనం–పచ్చదనం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లారు. అంబేడ్కర్ చౌరస్తాలో స్వచ్ఛదనం –పచ్చదనాన్ని పరిరక్షిస్తామని విద్యార్థులు, అధికారులతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పరిరక్షిస్తేనే మానవ మనుగడ ఉంటుదన్నారు. ప్లాస్టిక్ నివారణ, చెత్తచెదారం తొలగింపునకు రెడ్యూస్, రియూస్, రీసైకిల్ (త్రిబుల్ ఆర్) ప్రాతిపదికన ముందుకెళ్లాలన్నారు. తద్వార పర్యావరణ పరిరక్షణతోపాటు చాలవరకు ఖర్చులు తగ్గుతాయన్నారు. ఆరోగ్యవంతమైన మానవ జీవన మనుగడకు 33 శాతం అడవులుండాలని, ప్రస్తుతం 24 శాతం మాత్రమే ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మొక్కలు నాటి అడవులను పెంచేందుకు కృషిచేస్తే భవిష్యత్తుతరాల వారికి ఎంతో మేలు చేసినవారం అవుతామన్నారు. వనమహోత్సవంలో భాగంగా జిల్లాలో 82 లక్షల మొక్కలు నాటేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్టు తెలిపారు. వాతావరణం అనుకూలంగా కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోందన్నారు. పరిశుభ్రతను పాటించడమేగాక, చెట్లను పెంచడం ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి మాట్లాడుతూ.. ప్రజారోగ్యం మెరుగుపడేందుకు ఐదు రోజుల పాటు నిర్వహించే స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో అనంతరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్, తహసీల్దార్ సునీత, కౌన్సిలర్లు ఆకుల మమత, నీలం శ్వేత, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెడుదారిలో పయనించొద్దు

- యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి
- ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు

ఇబ్రహీంపట్నం: దేశ భవిష్యత్తు యువతపై ఆధార పడి ఉందని, చెడుదారిలో పయనించొద్దని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రూపొందించిన డ్రగ్స్, గంజాయి రహిత అవగాహన వాల్ పోస్టర్‌ను సోమవారం స్థానిక కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. వివిధ రంగాల్లో దేశం రాణించాలంటే యువత మేధస్సు, నైపుణ్యం అవసరమన్నారు. దురదృష్టవశాత్తు నేటి యువత కర్తవ్యాన్ని విస్మరిస్తూ మత్తులో తెలియాడుతూ జ్ఞానాన్ని,విచక్షణను, శక్తిసార్థ్యాలను కోల్పోయి నిస్తేజంగా మారుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు.సకల అనర్థాలు,అరాచకాలు,హత్యలకు మాదక ద్రవ్యాలు ప్రేరణ కలిగిస్తున్నాయన్నారు.ఇది సమాజానికి హానికరమన్నారు. డ్రగ్స్, గంజాయి రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చా రు. గంజాయిని విక్రయించినా,కొనుగోలు చేసినా,సేవించినా చట్టరీత్యా కఠిన చర్యలుంటాయని ఏపీపీ హెచ్చరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి జగన్, అలంపల్లి జంగయ్య, చెనమోని రాఘవేందర్, యాదగిరి, మహమ్మద్ సయీఫ్, యాదగిరి పాల్గొన్నారు.

గ్రామాలన్నీ పచ్చదనం కావాలి



స్వచ్ఛదనం - పచ్చదనంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న ట్రయినీ కలెక్టర్ ఉమాహారతి

ట్రయినీ కలెక్టర్ ఉమాహారతి

దౌల్తాబాద్: మండలంలోని గ్రామాలన్నీ పచ్చదనం కావాలని ట్రయినీ కలెక్టర్ ఉమాహారతి పిలుపునిచ్చారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని మాటూరు గ్రామాన్ని సందర్శించారు. వీధుల్లో తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఐదు రోజుల కార్యక్రమంలో భాగంగా గ్రామంలో అన్ని వీధుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని, మురుగు గుంతలు పూడ్చాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏపీఎం సాయన్న తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, లేకపోతే చర్యలు తప్పవని ట్రయినీ కలెక్టర్ ఉమాహారతి హెచ్చరించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ విజయ్‌కుమార్ బంటారం మండలానికి బదిలీపై వెళ్లడంతో శిక్షణలో భాగంగా ఆమె తహసీల్దార్ బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం ఎంత మంది విధుల్లో ఉన్నారు.. ఎన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయి వంటి వివరాలను డీటీ శివ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెండింగ్ భూ సమస్యలపై చర్చించి.. వెంటనే వాటిని పరిష్కరించాలని ఆదేశించారు.



క్లుప్తంగా

బైక్‌లు ఢీ, యువకుడి మృతి

మర్పల్లి: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కుటుంభ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఇబ్రహీం ఆదివారం సాయంత్రం తన బైక్‌పై పట్లూర్ మీదుగా బుదేర వెళ్తుండగా.. బుదేర నుంచి పట్లూర్ గ్రామానికి చెందిన శివకుమార్ తన బైక్‌పై పట్లూర్‌కు వస్తున్నాడు. ఈ క్రమంలో పాల శీతలీ కేంద్రం సమీపంలో రెండు వాహనాలు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం ఇబ్రహీంను మర్పల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. శివకుమార్‌కు తీవ్రగాయాలు కావడంతో సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కొలువుదీరిన కొత్త పాలకవర్గం



చైర్మన్‌గా ప్రమాణ చేస్తున్న మాధవరెడ్డి, డైరెక్టర్లు. చిత్రంలో ఎమ్మెల్యే బీఎమ్మార్

బషీరాబాద్: వ్యవసాయ మార్కెట్ కమిటీ కొత్త పాలకవర్గం సోమవారం కొలువుదీరింది. మండల పరిధి కొర్విచెడ్ సమీపంలోని పంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరయ్యారు. మండల చైర్మన్‌గా జీవన్గీకి చెందిన మాధవరెడ్డి, వైస్ చైర్మన్‌గా చందర్, డైరెక్టర్లు ప్రమాణం చేశారు. తనకు అవకాశం ఇచ్చిన ఎమ్మెల్యేకు మాధవరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

పీఆర్ డీఈ ఇన్‌చార్జిగా కృష్ణ

తాండూరు రూరల్: పంచాయతీరాజ్ విభాగం తాండూరు–పెద్దేముల్ మండలాల ఇన్‌చార్జి డీఈగా కృష్ణ జోషిని నియమించారు. గతంలో డీఈగా పనిచేసిన వెంకట్ రావు.. వారం రోజుల క్రితం ఉద్యోగ విరమణ పొందారు. ఆయన స్థానంలో యాలాల–బషీరాబాద్ పీఆర్ డీఈగా పనిచేస్తున్న జోషికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

భోజనం మేమే వడ్డించుకుంటాం!



తోటి వారికి భోజనం వడ్డిస్తున్న విద్యార్థినులు

పెద్దేముల్: మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా పాఠశాలలో నిర్వాహకులు వంట చేయగా.. విద్యార్థులు ఒకరికి ఒకరు వడ్డించుకున్నారు. ఇదీ మండల పరిధి మన్‌సాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం చోటు చేసుకుంది. భోజన విరామ సమయంలో వంట మనిషి చిన్నారులకు భోజనం వడ్డిస్తుండగా.. ఇద్దరు చిన్నారులు తోటివారికి గుడ్లు, సాంబర్ పోశారు. ఇదే విషయాన్ని హెచ్‌ఎం సాయి రేణుక, ఉపాధ్యాయురాలు గిరిజను వివరణ కోరగా.. తాము ఎంత చెప్పినా విద్యార్థినులు వినటం లేదని, ఇష్టంగానే వడ్డిస్తున్నారని తెలిపారు. ఎంఈఓ దశరథ్‌ను వివరణ కోరేందుకు యత్నించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

ప్రాణం తీసిన వేగం

శంకర్‌పల్లి: అతి వేగం ఓ ఇల్లాలి మృతి కారణమైంది. ఈ ఘటన ఆదివారం రాత్రి శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మహాలింగపురం వద్ద చోటు చేసుకుంది. ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గడి మల్కాపూర్ గ్రామానికి చెందిన సదా(23)కు మొయినాబాద్ మండలం అప్పారెడ్డిగూడకు నవీన్‌తో ఏడాది క్రితం వివాహమైంది. జులై 30న బోనాల ఉత్సవాలకు పుట్టింటికి వెళ్లింది. ఈ నెల 4న నవీన్ తమ్ముడు నరేందర్‌తో కలిసి సదాను తీసుకువెళ్లేందుకు గడి మల్కాపూర్ వచ్చారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో వీరు మహాలింగపురంశివారులో రోడ్డుపై ఉన్న గుంతలో పడిపోయారు. ఈ ఘటనలో సదా తలకు తీవ్ర గాయాలు కాగా.. అన్నదమ్ములు స్వల్పంగా గాయపడ్డారు. సదాకు శంకర్‌పల్లి ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన చికిత్స నిమిత్తం నగరానికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. కేసు దర్యాప్తులో ఉంది.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ ఒమేగాహోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటిపని/వంట పనికు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజ నం.జీ:20K.ఫోన్: 8977639662 / 8977639663 [H-796262]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశితంగా పరిశీలించి వివప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే రేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

కొడంగల్‌లో అభివృద్ధి పరుగులు



మార్కెట్ యార్డులో నిర్మిస్తున్న భారీ వంటశాల భవనం

- ప్రత్యేకంగా దృష్టి సారించిన సీఎం రేవంత్‌రెడ్డి
- పైలట్ ప్రాజెక్టుగా సెగ్మెంట్ ఎంపిక
- సెంట్రలైజ్ కిచెన్ నిర్మాణం
- నిత్యం 28వేల మంది విద్యార్థులకు అందనున్న అల్పాహారం, భోజనం

కొడంగల్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన నియోజకవర్గంపై ప్రత్యేక దష్టి సారించారు. అభివద్ధిని పరుగులు పెట్టిస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఏ పాలకులు చేయని.. చూడని విధంగా వరాల జల్లు కురిపిస్తున్నారు. తన పదవీ కాలంలో కొడంగల్‌ను అభివృద్ధికి చిరునామాగా మార్చడమే కాకుండా.. సర్కారు బడుల బలోపేతానికి అహర్నిశలు పాటుపడుతున్నారు. ఇందులో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా కొడంగల్ నియోజకవర్గంలోని 8 మండలాల పరిధి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 28వేల విద్యార్థులందరికీ నిత్యం అల్పాహారం, భోజనం అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగానే పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో హరేరామ హరేకృష్ణ, సీఎస్‌ఆర్ ఆధ్వర్యంలో సెంట్రలైజ్ కిచెన్ షెడ్‌ను నిర్మిస్తున్నారు.

బాహుబలి కిచెన్ షెడ్

కొడంగల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఇప్పటికే సెంట్రలైజ్ కిచెన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. షెడ్ నిర్మాణ పనులు పూర్తి అయిన వెంటనే ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేసేందుకు అధ్యయనం చేయనున్నారు. ఇదే విషయమై గతవారం ఆయా సంస్థల ప్రతినిధులతో గత వారం సీఎం సమావేశం అయ్యారు.



హరేరామ హరేకృష్ణ ప్రతినిధులతో మాట్లాడుతున్న సీఎం (ఫైల్)



యాలాలలో.. కాంగ్రెస్ శ్రేణులు

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

సంబురాలు చేసుకున్న కాంగ్రెస్ శ్రేణులు



తాండూరులో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే బీఎమ్మార్. చిత్రంలో మంత్రి పొంగులేటి, స్పీకర్

తాండూరు టౌన్/ యాలాల: ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. తాండూరులోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ పార్టీ శ్రేణులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. యాలాల మండల కేంద్రంలో ఆ పార్టీ నేత పేరి రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీకేక్ కట్ చేసి, టపాసులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. అనంతరం ఏఎంసీ డైరెక్టర్‌గా ఎన్నికైన గోనేగారి శ్రీనివాస్‌ను సన్మానించారు. ఇందులో కో–ఆప్షన్ సభ్యుడు అక్బర్‌బాబా, నాయకులు శేఖర్, నర్సింలు, అహ్మద్, అశోక్, మైనొద్దీన్, లాలప్ప తదితరులు ఉన్నారు.

మూడు దశాబ్దాల కల నెరవేరింది

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్



మిఠాయిలు తినిపించుకుంటున్న నాయకులు

యాలాల: మూడు దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న ఎస్సీ వర్గీకరణ కల ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో నెరవేరిందని సమితి జిల్లా అధ్యక్షుడు కేరెళ్లి ఆనంద్ తెలిపారు. వర్గీకరణకు సానుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో సోమవారం ఎంఎస్‌పీ జిల్లా కార్యదర్శి దప్పు మహేందర్ ఆధ్వర్యంలో సంబురాలు చేసుకున్నారు. అంబేడ్కర్ విగ్రహం ఎదుట మందకృష్ణ, ప్రధాని మోదీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడారు. వర్గీకరణ కోసం మందకృష్ణ అహర్నిశలు పాటుపడ్డారని, కేంద్ర ప్రభుత్వం కృషి ఉందని పేర్కొన్నారు. అనంతరం టపాసులు కాల్చి, మిఠాయిలు తినిపించుకున్నారు. కార్యక్రమంలో సమితి సీనియర్ నాయకుడు పెద్దోళ్ల ఆనంద్‌కుమార్, ఎంఎస్‌పీ జిల్లా కోకన్వీనర్ అజయ్ ప్రసాద్, మండల అధ్యక్షుడు సూర్యప్రకాష్, మెట్లి కృష్ణ, మలిగేరి నర్సింలు తదితరులు ఉన్నారు.

పూడూరు తహసీల్దార్‌గా భరత్‌గౌడ్



పూడూరు: తహసీల్దార్ భరత్‌గౌడ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన తహసీల్దార్ రమాదేవి బదిలీపై సంగారెడ్డి జిల్లాకు వెళ్లగా.. మహబూబ్‌నగర్ జిల్లా మన్యంకొండలో పనిచేస్తున్న భరత్ ఇక్కడికి వచ్చారు.

కొడంగల్ డీటీగా శ్రీనివాస్



కొడంగల్: డిప్యూటీ తహసీల్దార్‌గా బండారు శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన డీటీ నర్సింలు బదిలీపై వెళ్లగా.. ఆయన స్థానంలో హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ తహసిల్ కార్యాలయంలో డీటీగా పని చేస్తున్న శ్రీనివాస్ ఇక్కడికి వచ్చారు.

రాయితో కొట్టి వృద్ధురాలి హత్య

హస్తినాపురం: ఇళ్లలో పనిచేస్తూ జీవనం గడుపుతున్న వృద్ధురాలిని గుర్తు తెలియని వ్యక్తి బండరాయితో తలపై కొట్టి హత్య చేసిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చీమల బాలమ్మ(63) కృష్ణానగర్‌కాలనీలో సుమారు 30 ఏళ్లుగా నివాసం ఉంటోంది. చుట్టుపక్కల ఇళ్లలో పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. సోమవారం ఇళ్లలో పనిచేయడానికి రాకపోవడంతో పక్కనే ఉన్న వారు బాలమ్మ ఇంట్లోకి వెళ్లి చూశారు. ఆమె మృతి చెంది ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. బాలమ్మ మృతదేహాన్ని పరిశీలించగా మృతురాలి తలపై రాయితో కొట్టిన గాయాలు ఉన్నాయని, గుర్తు తెలియని వ్యక్తి హత్యచేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. కాలనీకి చెందిన చింతకాయల హరిబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నారు.

అదుపు తప్పిన రెడీమిక్స్ వాహనం

మణికొండ: అతివేగం కారణంగా అదుపు తప్పిన రెడీమిక్స్ వాహనం విద్యుత్ స్తంభాలను ఢీ కొట్టి డివైడర్‌పై నిలిచిపోయింది. ఆ సమయంలో రహదారిపై ఎవరూ లేకపోవటంతో పెను ప్రమాదం తప్పింది. రాజేంద్రనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం 6గంటల సమయంలో రాజేంద్రనగర్ డైరీ ఫాం నుంచి రాజేంద్రనగర్ వైపు వెళ్తున్న రెడీమిక్స్ వాహనం వెటర్నరీ కళాశాల ముందుకు రాగానే అదుపుతప్పింది. ఆ సమయంలో రోడ్డుపై వాహనాలు రాకపోవటంతో ప్రమాదం తప్పింది. డ్రైవర్ నిద్రమత్తులో ఉండటంతోనే ప్రమాదం జరిగి ఉంటుందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందజేసిన పాత్రికేయులు



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

అనంతగిరి/తాండూరు టౌన్: జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని సమాచార, రెవెన్యూ శాఖ మంత్రి పొంగు లేటి శ్రీనివాస్ రెడ్డికి టీయూడబ్ల్యూజేఐజేయూ, టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాత్రికేయులు మాట్లాడారు. జిల్లాలో పనిచేస్తున్న పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించాలని పేర్కొన్నారు. మున్సిపల్ సర్వసభ్య సమావేశానికి అనుమతి ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హెల్త్ కార్డుతో జర్నలిస్టులకు అన్ని కార్పొ రేట్ ఆస్పత్రుల్లో వైద్య చికిత్సలు అందించాలని కోరారు. దీనికి మంత్రి పొంగులేటి సానుకూలంగా స్పందించి, త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇందులో టీయూడబ్ల్యూజేఐజేయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు ఆర్‌ఎం గిరీశ్వర స్వామి, సీనియర్ జర్నలిస్టులు ప్యాట రవి, షఫీ, మహేందర్, వైద్యనాథ్, మహేశ్, గైబుల్, బాలయ్య, సత్యం, అశోక్, వెంకటేశ్, శ్రీకాంత్, కృష్ణ, రాజు, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) తాండూరు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్‌రెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

నిరుపేదలకు భూ పంపిణీ చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, రైతులు

- పొజిషన్‌లో ఉన్న రైతులకు పట్టాపాస్ బుక్‌లు ఇవ్వండి
- సీపీఎం జిల్లా అధ్యక్షుడు భాస్కర్
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

తలకొండపల్లి: ప్రభుత్వ భూమిని నిరుపేదలకు పంపిణీ చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు కాడిగళ్ల భాస్కర్ మాట్లాడుతూ.. మండల పరిధిలోని ఖానాపూర్ శివారులోని 16, 18, 20సర్వే నంబర్లలో 24.20 ఎకరాల ప్రభుత్వ అసైన్డ్ భూమిని గ్రామానికి చెందిన కొందరు కోర్టు నుంచి ఓఎస్ నంబర్ ద్వారా డిగ్రీ పొంది ఆర్‌ఓఆర్ రికార్డుల్లో నమోదు చేసుకున్నారని ఆరోపించారు. ఆ భూమిని పట్టా భూమిగా మార్పిడి చేయించుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్ముకున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ స్థలాన్ని వెంటనే బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. 145/1 సర్వే నంబర్‌లో 10.23 ఎకరాల సీలింగ్ భూమిని భూమి లేని నిరుపేదలకు పంపిణీ చేయాలని కోరారు. 1992లో చాదర్‌పల్లి గ్రామంలో భూ పోరాటం చేసి పేదలకు పట్టాలు ఇచ్చామన్నారు. మూడు దశాబ్దాలుగా పొజిషన్‌లో ఉన్నప్పటికీ రెవెన్యూ అధికారులు నేటికీ లబ్ధిదారుల పేర్లు నమోదు చేయలేదని మండిపడ్డారు. పొజిషన్‌లో ఉన్న రైతులకు తక్షణమే పట్టాపాస్ పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రంగారెడ్డికి భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ కన్వీనర్లు కానుగుల వెంకటయ్య, పెంటయ్య, మండల కార్యదర్శి కురుమయ్య, శివ శంకర్, పోచయ్య, లింగయ్య, గోపయ్య, పాపయ్య, రాములు, లక్ష్మమ్మ, శ్రీలత, అంజయ్య, యాదయ్య, శ్రీశైలం, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు చూపించాలి



అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

నవాబుపేట: ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి ఏళ్లు గడుస్తున్నా.. భూమి కబ్జా ఇవ్వడం లేదని ఎల్ల కొండ గ్రామస్తులు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మేరకు సోమవారం అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. తమకు అసైన్డ్ చేసిన ప్రభుత్వ భూమిని తీసుకొని సబ్‌స్టేషన్ నిర్మించారని తెలిపారు. ఆ భూమికి బదులు, సాయిబాబా ఆలయం వద్ద సర్కారు జాగలో ఇళ్ల స్థలాలు ఇస్తామని 15 ఏళ్ల క్రితం ఇళ్ల పట్టాలు ఇచ్చారని పేర్కొన్నారు. కానీ ఇప్పటి వరకు స్థలం చూపడం లేదని వాపోయారు. ఇదే విషయమై పలుమార్లు అధికారులు, పాలకులకు విన్నవించినా ఫలితం లేదని ఆరోపించారు. ఇళ్ల పట్టాలు ఇచ్చిన వారికి భూమి కబ్జా ఇవ్వాలని కోరారు. గాలయ్య, నర్సింలు, ప్రకాశ్, అర్జున్, మహేందర్, పరమేష్, కిష్టయ్య, మల్లేషం ఉన్నారు.

అర్ధరాత్రి ఆలయంలో చోరీ



హుండీలోంచి నగదును అపహరిస్తున్న దొంగ

మొయినాబాద్: ఆంజనేయ స్వామి ఆలయంలో ఓ దుండగుడు హుండీ పగులగొట్టి డబ్బులు దోచుకెళ్లాడు. ఈ ఘటన మండల పరిధి పెద్దమంగళారంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో రాత్రివేళలో దొంగ చొరపడ్డాడు. హుండీ తాళం పగులగొట్టి అందులో డబ్బు ఎత్తుకెళ్లాడు. సోమవారం స్వామి దర్శనానికి వెళ్లిన భక్తులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని గుడిలోని సీసీ కెమెరాలు పరిశీలించారు. దొంగతనం చేసిన తీరు సీసీ కెమెరాలో నిక్షిప్తమైంది. కేసు నమోదు చేసిన పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా దొంగను పట్టుకునే పనిలో ఉన్నారు.

ఇద్దరు దొంగలకు రిమాండ్

శంకర్‌పల్లి: మొబైల్ షాప్‌లో చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగలను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. మోకిల సీఐ వీరబాబు తెలిపిన ప్రకారం.. జులై 25న అర్ధరాత్రి మోకిలలో బాలాజీ మొబైల్ షాపులో గుర్తు తెలియని దుండగులు దొంగతనం చేసినట్లు యజమాని జీవన్ జులై 26న పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా చోరీకి పాల్పడిన ఇద్దరు దొంగలను లంగర్‌హౌస్‌లో గుర్తించారు. ఆదివారం హైదరాబాద్‌కు చెందిన దుర్గారెడ్డి(33), షేక్ మహబూబ్(31)ను మోకిల, రాజేంద్రనగర్ సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశా రు. పోలీసుల విచారణలో వీరిపై పలు పోలీస్‌స్టేషన్లలో పదుల సంఖ్యలో కేసులున్నట్లు తేలింది. నిందితుల వద్ద రూ.1.20లక్షల నగదు, 14 సెల్‌ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం చేవెళ్ల కోర్టులో ప్రవేశపెట్టి రిమాండ్ నిమిత్తం సంగారెడ్డి జిల్లా కందికి జైలుకు తరలించామని పోలీసులు తెలిపారు.

వర్గీకరణను వ్యతిరేకిస్తున్నాం

తెలంగాణ మాలల ఐక్య వేదిక

ఇబ్రహీంపట్నం రూరల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పును నిరసిస్తూ మాల మహానాడు ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ మాలల ఐక్య వేదిక ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ఈ ధర్నా చేపట్టామన్నారు. సుప్రీం తీర్పును మోదీ తీర్పుగా భావిస్తున్నామన్నారు. దళితులకు కావాల్సింది వర్గీకరణ కాదని, రిజర్వేషన్లను 15 నుంచి 20 శాతానికి పెంచాలన్నారు. ఇందుకు దళిత సంఘాలన్నీ ఐక్యంగా పోరాడుతాయన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సహచరులైన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావుకు రాష్ట్రంలోని 50లక్షల మంది మాలల శక్తి చూపుతామన్నారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మాలల ఐక్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బాలకృష్ణన్, గుండాలు, భర్తాకి జగన్, మహేశ్, కృష్ణ, పోచన్న, ధన్‌రాజ్, శివ కుమార్, కాశీనాథ్‌తో తదితరులు పాల్గొన్నారు.



గాజీపూర్ వంతెన వద్ద రహదారిలో వాహనదారుల ఇక్కట్లు

దారి తీరు బేజారు..

- గుంతలు, ఆపై బురదమయం
- తాండూరు–సంగారెడ్డి ప్రధాన రహదారి దుస్థితి

పెద్దేముల్: నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే రహదారి ఇది. కనీస ప్రమాణాలు పాటించకుండా వాగుపై వంతెన నిర్మించారు. ఇరు వైపులా బీటీ వేయకుండానే మట్టిరోడ్డుతో మమ అనిపించారు. అనంతరం ఆర్భాటంగా ప్రారంభించారు. కానీ ఏడాది గడవక ముందే దారితీరు అధ్వానంగా మారి వాహనదారులకు చుక్కలు చూపెడుతోంది. ప్రయాణికుల కూసలు కదిలిస్తోంది. ఇదీ తాండూరు–సంగారెడ్డి ప్రధాన రహదారి దుస్థితి.

బైకులు నడవని దుస్థితి

సంగారెడ్డి, జహీరాబాద్, వికారాబాద్ ప్రాంతాలకు వెళ్లేమార్గం.. పెద్దేముల్ మండలం గాజీపూర్‌లో గతేడాది బ్రిడ్జి నిర్మించారు. వంతెనకు ఎగుదుదిగుడు వంద మీటర్ల వరకు ఎలాంటి పటిష్టమైన రోడ్డు నిర్మాణం చేపట్టకుండానే ప్రారంభించారు. మట్టిరోడ్డు కావడం వలన గుంతలు ఏర్పడ్డాయి. ప్రస్తుత వర్షాలకు వాటి తీవ్రత మరింత పెరిగింది. నీరు నిలిచి బురదమయంగా మారింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వాహనాలు బురదలో కూరుకుపోతున్నాయి. కనీసం ద్విచక్ర వాహనాలు నడవని పరిస్థితి. ఇదే విషయాన్ని సంబంధిత అధికారులు, పాలకులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పరిసర ప్రాంత ప్రజలు ఆరోపించారు. తక్షణమే అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణానికి తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

తక్కువ ప్రీమియంతో ఎక్కువ ప్రయోజనం

- తపాలా బీమా, సేవలను వినియోగించుకోండి
- మహబూబ్‌నగర్ వెస్ట్ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

కొడంగల్ రూరల్: తపాలా శాఖ తక్కువ ప్రీమియంతో ఎక్కువ ప్రయోజనాలు పొందేలా బీమా పథకాలను అందుబాటులోకి తెచ్చిందని మహబూబ్‌నగర్ వెస్ట్ సబ్ డివిజన్ తపాలా ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధి పర్సాపూర్ డాక్ డెవలప్‌మెంట్ కమ్యూనిటీ ప్రోగ్రామ్‌లో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తపాలా సేవలను ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఏడాదికి కేవలం రూ.550తో రూ.10లక్షల యాక్సిడెంట్ కవరేజ్, రూ.755తో రూ.15 లక్షల ప్రమాదబీమా పాలసీ చేయించుకోవాలని సూచించారు. అనుకోని ఘటనల్లో ఎవరైనా చనిపోతే వారిపై ఆధారపడిన కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారుతుందని, భార్య లేదా భర్త మరణిస్తే వారి పిల్లల చదువులు, ఇతర అవసరాల కోసం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు. తక్కువ ప్రీమియంతో ఎక్కువ లబ్ధి పొందేలా హెల్త్ ప్లస్, ఎక్స్‌ప్రెస్ ఇన్సూరెన్స్ పథకాలను ప్రవేశపెట్టిందని వెల్లడించారు.

బీమా సదుపాయాలు

నివా హెల్త్ ఇన్సూరెన్స్, తపాలా శాఖ సంయుక్త ఆధ్వర్యంలో తక్కువ ప్రీమియంతో రూ.10 లక్షల నుంచి 15లక్షల వరకు బీమా అందిస్తుందని, 18–65 ఏళ్లలోపు వారు ఈ పథకానికి అర్హులని అశోక్‌రెడ్డి పేర్కొన్నారు. ఏడాదికి ఒకే పర్యాయం రూ.555ల ప్రీమియంతో 10లక్షలు, రూ.755తో 15లక్షల ప్రయోజనం పొందవచ్చని తెలిపారు.

మరెన్నో ప్రయోజనాలు

శాఖ అందిస్తున్న ఆరోగ్య బీమా పథకాలతో ఎన్నో ప్రయోజనాలు చేకూరనున్నాయని అశోక్‌రెడ్డి తెలిపారు. పాలసిదారు ప్రమాదవశాత్తు మృతిచెందినా, శాశ్వత అంగవైకల్యం కలిగినా బీమా డబ్బు మొత్తం చెల్లిస్తారని, వారి పిల్లలు చదువుకుంటుంటే అదనంగా రూ.50వేల నుంచి లక్ష వరకు లబ్ధిపొందవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు తపాలా శాఖలో సంప్రదించాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, తపాలా సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.